తెలంగాణ అమరులకు ఘన నివాళి

గన్‌ఫార్కు వద్ద అమరులకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కవాడిగూడ, జూన్ 1: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం రాత్రి గన్‌పార్కు వద్ద భోలక్‌పూర్, కవాడిగూడ, గాంధీనగర్ డివిజన్ బీఆర్ఎస్ కమిటీల ఆధ్వర్యంలో అమరుల త్యాగాలను స్మరిస్తూ కొవ్వొత్తులను వెలిగించి నివాళులర్పించారు. తెలంగాణకు వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వల్లాల శ్యామ్ యాదవ్, వై. శ్రీనివాస్‌రావు, రాకేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు వెలకట్టలేనివి.. – తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి

కవాడిగూడ : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరుల త్యాగాలు వెలకట్టలేనివని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర పదవ అవతరణ దినోత్సవం సందర్భంగా శనివారం రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ అమరులకు నివాళులర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు కొంతం గోవర్ధన్‌రెడ్డి, రవీందర్, సీహెచ్ ఉపేందర్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

అమరులకు నివాళులర్పిస్తున్న పులిగారి గోవర్ధన్‌రెడ్డి, ఇతర న్యాయవాదులు

రాంనగర్‌లో...

ముషీరాబాద్ : తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం అవతరించి పదేళ్లు పూర్తైన సందర్భంగా రాంనగర్‌లోని అమరవీరుల స్తూపానికి బీఆర్ఎస్ గ్రేటర్ నేత ఎంఎస్ శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్‌గౌడ్, రజినీకాంత్, బాల్‌రాజ్‌గౌడ్, శివానంద్, అజయ్ ముదిరాజ్, నర్సింగ్‌రావు, సదా తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



రాంనగర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద శనివారం రాత్రి బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రావులపాటి మోజస్, మనోజ్ గౌడ్, రమేశ్‌యాదవ్, రాజుచారి, డింబ, ప్రవీణ్, మొయిజ్, శ్రీనివాస్, జీషన్, నర్సింగ్ తదితరులు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. – ముషీరాబాద్, జూన్ 1

శ్రీ రాగరమ్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో శనివారం సాయంత్రం గురువు రమ్య నేతృత్వంలో 'మల్లియలారా మాలికలారా..' శీర్షికన నిర్వహించిన సంగీత–నృత్య సమ్మేళనంలో చిన్నారుల ప్రదర్శనలను వీక్షించిన రైతుసేవ సహకార సొసైటీ బ్యాంక్ లిమిటెడ్ డైరక్టర్ కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, సంగీత, నృత్య గురువులు ప్రశంసించారు. – తెలుగు యూనివర్సిటీ

రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం..

చిక్కడపల్లి, జూన్ 1 : రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ అన్నారు. శనివారం గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు రాకేశ్‌కుమార్, ఎర్రం శ్రీనివాస్ గుప్తా, శ్రీధర్‌రెడ్డి, ముఠా శివసింహ, శ్రీకాంత్, చాణిక్యరెడ్డి పాల్గొన్నారు.

వీహెచ్‌కు సన్మానం

అంబర్‌పేట, జూన్ 1 : తెలంగాణ తొలి ఉద్యమం 1969లో అంబర్‌పేటలో క్రీయాశీలకంగా పాల్గొని లాఠీదెబ్బలు తిని జైలుకు వెళ్లిన మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావును తెలంగాణ రాష్ట్ర పదవ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పలువురు నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. బీజేపీ నాయకులు చింతల శ్రీనివాస్ ముదిరాజ్, కెంచె చంద్రశేఖర్ శాలువాతో సత్కరించి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

వడదెబ్బకు వ్యక్తి మృతి

కాచిగూడ, జూన్ 1: వడదెబ్బకు గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ ఎస్సై పి.రవికుమార్ కథనం ప్రకారం... గుర్తు తెలియని వ్యక్తి(55) కాచిగూడ డీమార్ట్ సమీపంలో గల పుట్‌పాత్‌పై వడదెబ్బకు మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖాన మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై గోధుమ రంగు చొక్కా, కాకి రంగు ప్యాంట్ ధరించి ఎత్తు 5.6 ఉన్నట్లు తెలిపారు. వివరాలకు 87126 60543లో సంప్రదించాలని ఎస్సై కోరారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు

శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కమిటీ అధ్యక్షుడు ఎస్. గోపాల్‌రావు

సాయిబాబా ఆలయంలో.. కార్పొరేటర్ బి.పద్మ

కవాడిగూడ, జూన్ 1: కవాడిగూడ డివిజన్ దోమలగూడలోని అడ్వకేట్ కాలనీలో గల శ్రీ బాల త్రిపుర సుందరీదేవి పంచముఖి ఆంజనేయస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ టి. రవీందర్ ఆధ్వర్యంలో శనివారం హనుమాన్ జయంతిని నిర్వహించారు. అదే విధంగా దోమలగూడ హనుమాన్ దేవాలయంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గొల్లగడ్డ రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో హనుమాన్ జ యంతిని నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ, బీఆర్ఎస్ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, ఎన్‌డీ సాయికృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దోమలగూడ ఆలయంలో పూజలు చేస్తున్న టి.రవీందర్

వివేక్‌నగర్ దేవాలయంలో..

చిక్కడపల్లి : వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో హానుమాన్ జయంతి సందర్భంగా శనివారం పూజలు నిర్వహించారు. దేవాలయం కార్యనిర్వాహణాధికారి మాచర్ల దేవనాథం కార్యక్రమాలను పర్యవేక్షించారు.

గాంధీనగర్‌లో ..

వీవీ గిరినగర్‌లో హనుమాన్ జయంతిని నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకుడు చంద్రశేకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజలకు బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జయసింహ, పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాకేశ్‌కుమార్ పాల్గొన్నారు.

కాచిగూడలో...

కాచిగూడ : శనివారం సాయిగిరిధర్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయ కమిటీ అధ్యక్షుడు ఎస్. గోపాల్‌రావు పాల్గొన్నారు.

అంబర్‌పేటలో..

అంబర్‌పేట: బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని శ్రీ షిర్డీ సాయిబాబా దేవాలయంలో నిర్వహించిన పూజల్లో కార్పొరేటర్ బి.పద్మ, సీనియర్ నాయకుడు బి.వెంక టరెడ్డి పాల్గొన్నారు.

అలరించిన సంగీత నృత్యోత్సవాలు

కళాకారిణి శ్వేతా ప్రసాద్‌ను సత్కరించిన గణాంకాల శాఖ ఉప సంచాలకురాలు వసుంధర

ముషీరాబాద్, జూన్ 1 : నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. నవ్యనాటక సమితి 65 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన భారతీయ శాస్త్రీయ నృత్య సంగీత కార్యక్రమాలు పలువురినీ విశేషంగా అలరించాయి. ఖాజానా, గణాంకాలశాఖ ఉప సంచాలకులు జి.వసుంధర ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రముఖ సంగీత కళాకారిణి శ్వేతాప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఆనందమోహన్, డాక్టర్ నండూరి విద్యారణ్యస్వామి, సుధామాల, ఇందిరహేమ, లక్ష్మీమానస, వాణీరమణ, శ్రీలత, సంస్థ అధ్యక్షుడు వీ. విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వానాకాలానికి మాన్‌సూన్ బృందాలు రెడీ

జెండా ఊపీ ప్రారంభిస్తున్న సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్, డీసీ మారుతీదివాకర్ తదితరులు

అంబర్‌పేట, జూన్ 1: రాబోవు వానాకాలంలో వరద ముంపు సమస్యను ఎదుర్కొనేందుకు అంబర్‌పేట సర్కిల్‌లో మాన్‌సూన్ బృందాలు రెడీ అయ్యాయి. వీటిని శనివారం సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ గోల్నాకలో ప్రారంభించారు. సర్కిల్ డీసీ మారుతీ దివాకర్, ఈఈ పేర్రాజు, డీఈలు రఘు, ప్రవీణ్, ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లతో కలిసి ఆయన మాన్‌సూన్ బృందాలకు జెండా ఊపీ బృందాలను ప్రారంభించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం పనిచేస్తాం

మెహిదీపట్నం, జూన్ 1 : మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం పనిచేస్తున్నామని కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మోహినుద్దీన్ అన్నారు. శనివారం లంగర్‌హౌస్ డివిజన్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేను కలిసి డ్రైనేజీ, నీటి సమస్యలపై ఫిర్యాదులు చేశారు. దీనికి స్పందించిన ఆయన సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

సూపర్‌స్టార్ కృష్ణ స్మారక పురస్కారాలు ప్రదానం



రవీంద్రభారతి, జూన్ 1 : తెలంగాణ ప్రభుత్వం సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు సారథ్యంలో యువకళావాహిని ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశం మందిరంలో పలువురు సినీ ప్రముఖులకు సూపర్‌స్టార్ కృష్ణ స్మారక పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ హైకోర్టు జస్టిస్ కె.లక్ష్మణ్ విచ్చేసి సూపర్‌స్టార్ స్మారక పురస్కారాలను అందజేశారు. డాక్టర్ పరుచూరి గోపాలకృష్ణ, పి.సాంబశివరావు, ఎస్‌వీ సుబ్బారాజు, మల్లికార్జున్‌రావు, రవీంద్రగోపాల్, ఎంవీ రఘు, సీ మాధవరావు అవార్డులు అందుకున్నారు.

అనాథ పిల్లల నడుమ పుట్టినరోజు వేడుకలు

అనాథ పిల్లలతో కలిసి టిఫిన్ చేస్తున్న ఉప్పు సుధాకర్

అంబర్‌పేట, జూన్ 1: అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన 1969 తెలంగాణ ఉద్యమకారుడు ఉప్పు సుధాకర్ తన 75వ జన్మదినాన్ని విద్యానగర్‌లోని స్ఫూర్తి అనాథ పిల్లల ఆశ్రమంలో పిల్లల మధ్య శనివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం అక్కడ ఉన్న పిల్లలందరికీ టిఫిన్ తినిపించి తాను కూడా వారితో కలిసి టిఫిన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన 75వ జన్మదినాన్ని అనాథ పిల్లల మధ్యన జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. పిల్లలు చాలా క్రమశిక్షణతో ఉన్నారని తెలిపారు.

అన్నదానం..

చిక్కడపల్లి,జూన్ 1 : హనుమాన్ జయంతి సందర్భం గా రోహిత్‌కుమార్, రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం వివేక్‌ననగర్ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చిక్కడపల్లి సీఐ సీతయ్య, బీఆర్ఎస్ నాయకుడు ముఠా జయసింహ, బీజేపీ నాయకుడు వినయ్‌కుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

'మేలుకొన్న జ్ఞాపకాలు' పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యేలు వివేక్, వినోద్ తదితరులు

చిక్కడపల్లి, జూన్ 1 : తురుగా ఫౌండేషన్, సాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత దివంగత పోతరాజు శ్రీరామరావు రచించిన తెలుగు కథల సంకలనం 'మేలుకొన్న జ్ఞాపకాలు' పుస్తకావిష్కరణ సభ శనివారం సాయంత్రం బాగ్‌లింగంపల్లి లోని డాక్టర్ అంబేద్కర్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎల్వీ సుబ్రహ్మణ్యం హాజరై మాట్లాడారు. ఈ కార్యమంలో బీఆర్ అంబేద్కర్ విద్యాసంస్థల చైర్మన్, ఎమ్మెల్యే డాక్టర్ జీ వివేక్, కార్యదర్శి ఎమ్మెల్యే జి.వినోద్, డాక్టర్ వంగపల్లి విశ్వనాథం, రమణకుమార్ తదిరుతులు పాల్గొన్నారు.

పబ్లిక్ గార్డెన్స్‌లో.. 'వర్క్ ఫర్ హెల్త్'

నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో జాగో ఇండియా జాగో ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'వర్క్ ఫర్ హెల్త్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ కార్యదర్శి మణిలాల్ షా విచ్చేసి రూ.10 వేల చొప్పున ఐదుగురికి బహుమతులను ప్రదానం చేశారు. జావేద్ షరీఫ్, మెహిదీ అలిఖాన్, పి.సుధాకర్, హరిహర్‌సింగ్, తాజ్, మునీర్, ఎం. శ్యాం తదితరులు పాల్గొన్నారు. – అబిడ్స్, జూన్ 1

హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ మే 8వ తేదీన అనారోగ్య కారణాల వల్ల మృతిచెందిన హెడ్ కానిస్టేబుల్ వెంకటస్వామి కుటుంబానికి ఖర్చుల కింద ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 50 వేల చెక్కును గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ డి. రాజు సెంట్రల్ జోన్ డీసీపీ అంక్షాన్స్ యాదవ్ చేతుల మీదుగా అందజేశారు. – కవాడిగూడ, జూన్ 1

కార్ల బ్యాటరీలు చోరీ..

అంబర్‌పేట, జూన్ 1: కార్ల బ్యాటరీలు చోరీచేసిన ఘటన అంబర్‌పేట పరిధిలో జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. డీడీ కాలనీ అహోబిల మఠం,ఏ లేన్‌లో స్థానికులు కార్లను పార్కింగ్ చేస్తున్నారు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దొంగ లిద్దరు కారులో వచ్చి పార్కింగ్ చేసిన ఆరు కార్లలోని బ్యాటరీలను దొంగిలించారు. ఈ ఘటన సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయింది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శకటాన్ని ప్రారంభించిన దీపాదాస్ మున్షీ

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఫిషర్‌మెన్ కమిటీ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో శకటాన్ని ఏర్పాటు చేశారు. ఈ శకటాన్ని టీపీసీసీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఎమ్మెల్సీ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ఘనత సోనియాగాంధీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో భువనగిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. – అబిడ్స్, జూన్ 1

డయాబెటిస్‌పై అవగాహన కల్పించాలి

డ్రీమ్‌ఫోర్స్ సమ్మర్ క్యాంపులో పాల్గొని చిన్నారులను అభినందిస్తున్న ఉస్మానియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ బి. నాగేందర్

సుల్తాన్‌బజార్,జూన్ 1: ఇటీవల కాలంలో చిన్నారులపై అత్యధికంగా ప్రభావం చూపుతున్న టైప్–1 డయాబెటిస్‌పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఉస్మానియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ బి. నాగేందర్ అన్నారు. శనివారం ఉస్మానియా దవాఖానలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎండోక్రైనాలజీ విభాగం ఆధ్వర్యంలో డ్రీమ్‌ఫోర్స్ సమ్మర్ క్యాంప్–2024ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దవాఖానలో సుమారు 300కు పైగా టైప్–1 డయాబెటిస్ బారిన పడిన చిన్నారులకు రక్షణ కల్పించడంతో పాటు అధిక నాణ్యత కలిగిన ఇన్సులిన్‌ను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. దవాఖాన అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ త్రివేణి, ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం ఆఫీసర్ జగన్నాథ్‌రెడ్డి, నెఫ్రాలజీ విభాగాధిపతి డాక్టర్ మనీషాసహాయ్, సీఎస్ అడ్మిన్ ఆర్ఎంవో డాక్టర్ శేషాద్రి, డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవోలు డాక్టర్ సాయిశోభ, డాక్టర్ బండారి శ్రీనివాసులు, ఆర్ఎంవోలు డాక్టర్ సుష్మ, డాక్టర్ అనూరాధ పాల్గొన్నారు.

గుట్కా, పాన్‌మసాల అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

కాచిగూడ, జూన్ 1: నిషేదిత గుట్కా, పాన్‌మసాల ప్యాకెట్లు అమ్ముతున్న వ్యక్తిని కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. గోల్నాక, సంజీవయ్యనగర్‌కు చెందిన కె. రాఘవేందర్‌ది కిరాణాషాపు. గుట్కాలను అధిక ధరలకు అమ్ముకుంటూ సొమ్ముచేసుకుంటాడు. విస్వసనీయ సమాచారం మేరకు కాచిగూడ ఎస్సై పి.రవికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి రాఘవేందర్ నిర్వహిస్తున్న గోదాంలో దాడులు నిర్వహించి రూ.11 లక్షల విలువ చేసే గుట్కా, పాన్‌మసాల ప్యాకెట్లలను స్వాధీనం చేసుకొని రాఘవేందర్‌ను అరెస్ట్ చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాగర్‌సోల్ రైలులో చోరీ

కాచిగూడ,జూన్ 1: నాగర్‌సోల్ రైల్లో ప్రయాణిస్తున్న మహిళ బ్యాగులోంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు ఆభరణాలను తస్కరించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. రాజమండ్రికి చెందిన మెహన్‌రావు భార్య వాణి. నాగర్‌సోల్–కాచిగూడ రైల్లో కాచిగూడకు వస్తుండగా కామారెడ్డి రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు బ్యాగులో ఉన్న 16 గ్రాముల బంగారు ఆభరణాలను తీసుకొని పారిపోయారు. శనివారం మెహన్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.